**"పెళ్లి కాని అమ్మాయిలకు అపూర్వఅవకాశం!" పైట సవరించుకుని చదివాను.**
**"మీరు మెచ్చే పారితోషికం!" సవరించిన పైటనే సవరించాను.**

"విజేత మీరే కావచ్చు!"

"మీరు చేయవలసిందల్లా ...

1. సొంతదస్తూరితో 'బంగారం'మీద ఓ వ్యాసం రాయండి.

2. మీ ఇటీవలిఫొటోను (పాస్‌పోర్ట్ కానక్కర్లేదు) జతపరిచి నెలలోగా పంపండి.

3. మీ ప్రయత్నం ఫలితాన్నివ్వకపోతే ఫొటోతో బాటు వ్యాసం కూడా క్షేమంగా పంపబడుతుంది.

ఎడ్రస్: బాక్స్ నంబర్ 24, జి.పి.ఒ. హైదరాబాదు - 500001."

చదివాను. మళ్లీ మళ్లీ చదివాను.

ఇలాంటివి ఎన్నో చదువుతూంటాం. ఏదో ఉత్సాహం వచ్చి ఆ ఉత్సాహంలో ఏమీ తెలీదు. ఫ్రీ గిఫ్ట్ - ఫ్రీ అంటేనే గిఫ్ట్ కదా! మరేవిఁటో ఫ్రీ గిఫ్టట! ఊరించడానికి కాకపోతే ఏమిటి?

అమ్మో! అమ్మాయిలకీ, బంగారానికీ ముడిపెట్టి పోటీ పెడుతున్నారు. ఏమిటీ వీళ్ల ఉద్దేశం?

మంచి వ్యాసం రాసి మొహంమీద కొట్టాలి! ప్రైజుకొట్టడం తర్వాత సంగతి.

* * *

"ఇన్నేళ్లొచ్చాయే! ఇంకా ఎవర్నైనా ప్రేమించవేంటే?" అంటూ ఆ మధ్య మనోకాంత నిలేసింది.

"ఏడిశావ్! ప్రేమించడమంటే పాపిట తీసుకోవడమంత ఈజీ అనుకున్నావేంటీ? ఏళ్లొచ్చాయని ప్రేమిస్తే వేవిళ్లొచ్చేను! ఆ తర్వాత తీరిగ్గా ఏడవగలవు!" అంటూ మందలించింది ముక్తికాంత.

అన్నట్టు మనోకాంత, ముక్తికాంత మీకు తెలీదు కదూ! వాళ్లిద్దరూ నా డియరెస్ట్ ఫ్రెండ్సన్నమాట. మా తాతయ్యే పరిచయం చేశాడు. ఎప్పుడూ నాతోనే ఉంటారు. ఇది చాలా సీక్రెట్. ఎవరితోనూ అనొద్దేం!

మనోకాంత అల్లరిపిల్ల. అన్నీ కావాలంటుంది. ఏమిటేమిటో! అంతూపొంతూ ఉండదు. ముక్తికాంత అదోరకం. హాయిగా ఉండడానికి అవన్నీ కావాలేంటి? అంటూ నవ్వేస్తుంది. వీళ్లిద్దరికీ పడదు. గొడవలు. నేనెంచక్కా వీళ్లిద్దర్నీ చూస్తూ విస్తుపోతూ ...

నన్నెవరైనా కేకవేసినప్పుడు ఇద్దరూ గొడవపడ్డం ఆపి, ఒకేసారి నావైపు చూస్తారు - ఎవరో నిన్ను పిలిచినట్టుంది అన్నట్టు.

"లక్కాం."

'ఏమిటయ్యా ఎక్కాం -' అని వెక్కిరింతగా గొణుక్కుంటూ వెళ్లాను. నాకెంత కోపం అంటే ... అసలీ తాతగారు నా కెందుకిలాంటి పేరుపెట్టారు? లక్కమాంబ. ఎందు కట? ఏఁ పేరిది? ఎంచక్కా ఎన్ని పేర్లు లేవు?

స్కూల్లో కొన్నాళ్లపాటు ఒక నిక్‌నేమ్ 'బక్కమాంబ' అంటూ, కాలేజీలో నేను ఎవర్నీ కేర్ చెయ్యనని అనుకుంటారు. వాళ్లవాచిన మొఖాలు చూడకపోతే కేర్ చెయ్యనట్టా? అందుకు నా పేరు 'టెక్కమాంబా?

తాతయ్యనీ రోజు అడిగి తీరాలి!

"ఏవయ్యా! నేనేవన్నా నీ బిల్డింగునా? పోనీ నీ కూతురినా? నాకేటి ఈ పేరెట్టావు? నేనొప్పుకోను, తీసేసుకో!" అంటూ నేలమీద పాదాలతో కొడుతూ అల్లరిగా ఏడుపు ముఖం పెట్టాను.

బోసినోటికూ్కడా నవ్వాలని ఉంటుంది కాబోలు! పైగా తమలపాకులు వేసుకుని మరీ ...

'నీ కోపం చూస్తుంటే మా ఆవిడే గుర్తొస్తుంది.' తాతయ్య ముఖంలో వెలుగుచూస్తుంటే మరీ కోపం ముంచుకొచ్చింది.

"ఏఁ? నా అంత చిన్నప్పుడే నీకు ఆవిడ తెలుసా? మీది లవ్ మారేజేంటి?" అని ఏడిపించాను.

"నీ ఇల్లు బంగారంగానూ! అద్సరే, నువ్వెర్నైనా ప్రేమించడంలేదు కదా?"


"సారె!" సిగ్గు దాచుకుంటూ అన్నాను. "నువ్వింకా పెళ్లి చేయందే!"

"శీఘ్రమేవ! ఈ రోజే నిష్ఠగా రుక్మిణీ కల్యాణం చదువుతాను."

"వద్దు. ప్రేమలేఖలు రాయడం నేర్పు. వాటిని నువ్వే పట్టుకెళ్లు! ఇక నేను - 'ఘనుడా భూసురుడేగెనో!' అంటూ పద్యాలు చదువుకుంటాను.

పకపకా నవ్వి, "అక్కమ్మా! నువ్వు కృష్ణున్ని ప్రేమించాలే కానీ, లేఖలెందుకు? వారే ఏకంగా - 'తన వెంటన్ సిరి ...' అంటూ పద్యం మొదలు!"

"అయ్యా, తాతగారూ!



ఎత్తుకున్న పద్యాన్ని దింపండి. నేనిప్పుడు గజేంద్రుడి పొజిషన్లో లేను. ఆబాలగోపాలమంటూ వారందరూ వస్తే కాఫీలు, టీలు ఇవ్వలేను!" అంటూ విసురుగా తిరిగాను.

"అన్నట్టు నాకో కాఫీ పట్టుకురారాదూ!"

"అలాగే!" అంటూ వెళ్లి కాఫీపెట్టాను. ఆ బంగారపు ప్రకటన చూసినప్పటి నుంచి ఏమిటో ప్రతీదీ చాలా ఇంటెరెస్టింగ్‌గా ఉంది. చేతుల్లో శ్రద్ధా, భక్తీ తాండవిస్తోంది.

నేనందించిన కాఫీ గ్లాసుని ఎదురుగా గోడమీద కాలెండర్లో కృష్ణుడికి ఎత్తి నివేదనలా చూపిస్తూ "గోపాలా!" అంటూ చప్పరించి, "ఏవిఁటమ్మా, ఈ రోజు కాఫీ ఇంత బాగుందీ!" అన్నారు.

"అవును, పాలు గోపాలంగారు పంపారు. అందుకని!"

"బంగారంలాంటి కాఫీ ఇచ్చావు. ఏం కావాలో చెప్పు!"

"చెప్పడం కాదు, అడుగుతున్నాను. నాకు లక్కమాంబ అంటూ పేరెట్టావు కదా! ఎందుకు? ఎందుకూ అని అడుగుతున్నాను."

కాఫీగుటకవేసి తాద్యాత్మ్యంతో కళ్లుమూసుకుని అన్నారు "నువ్వు మా నాయనమ్మవి కదా!"

"ఓహో ఇదొకటా! ముందు మీ నాయనెవరో చెప్పు, నాయనా!" వెక్కిరించాను.

"మా నాయన ... బమ్మెర పోతన! 'దయము సత్యంబు లోనుగా తలుపడేని - కలుగనేటికి? అంటూ అందరి తల్లుల ఒడిలో సౌజన్యసంతానాన్నే చూడాలని తపనపడ్డాడు. ఆ సౌజన్యమూర్తిని కన్న తల్లి పేరే లక్కమాంబ!"

తాతయ్య మంచి మూడ్‌లోకి వచ్చాడు. వెంటనే వెళ్లి పేపరు, కళ్లజోడు తెచ్చాను. నేను మడతపెట్టి పేపర్లో చూపించినది రాగయుక్తంగా చదువుతూ, ఆగి నీకుగానీ బంగారం కావాలా ఏంటి?" అన్నారు రాగయుక్తంగానే.

"అవునూ!" అదే రాగంలో పలికాను.

"నువ్వే బంగారానివి. నీకింకా అదెందుకు? బరువొకటి?"

"పరవాలేదు. బంగారమయితే ఎంత బరువైనా మోస్తాను, తీసుకురా!" ఏమంటాడోనని ఉడికించాను.

"లక్కమ్మా! విద్యే నీకు సొమ్ములని ఎన్నిసార్లు ..."

"ఇంకా నయం, విద్యే లంగాలు, విద్యే చీరలన్నావు కాదు! అద్సరే, ఈ ప్రకటనకి వ్యాసం నేను రాయాలి."

"శుభం! రాయి. దానికింత గొడవెందుకు?"

"గొడవ కాదు, ప్రిపరేషను."

"అంటే, భేరీనినాదమన్నమాట!" నవ్వారు.

ఈ తాతగారు శుభంఅన్నారంటే వ్యాసం రాసినట్టేనని ముక్తికాంత మనోకాంతను గిచ్చుతోంది..

"అయితే ఎంతిస్తారంటావ్, తాతయ్యా?" అంటూ పక్కన చేరాను.

"వాళ్లెంత ఇస్తే ఏమిటి? నువు రాసేది బాగుండాలి - మా ఫలేషు కదాచన!"

"సర్లేవయ్యా! అక్షరాలా బంగారంమీద వ్యాసం, దానికి తగిన పారితోషికం అని ఉంటే మా ఫలేషం షావేంషీ !నువ్వో చెయ్యి వెయ్యాలి!"

"నాకూ, బంగారానికీ అసలు పడదు. వ్యాసం కాదు, వ్యాసార్థం కూడా రాదు. నాకేవిఁటీ - ఈ బంగారం కనిపెట్టినప్పట్నుంచీ దాన్ని ఇంకోరకంగా తయారుచేయాలని ఎంతోమంది యమయాతన పడ్డారు."

"పడి?"

"పడి ఫెయిలయ్యారు!"

"సో, బంగారం గురించిన ఆలోచనలు మానేయ్!"

ఇక నిరుత్సాహం భరించలేక సరదాగా ఉడికించడం అనే అస్త్రాన్ని సంధించాను. "చాల్చేల్లేవయ్యా! నీ కొడుకు, మీ మనవడు - అనగా నా తమ్ముడు చదువుకి సరసంగా ఉంటుందని రెసిడెన్షియల్ స్కూల్లో చేరాడా! మీ కోడలు శాస్త్రప్రకారం వారితో వెళ్లిందా? వాడు ప్లస్ టూ అయ్యే లోపల మనకి రెండు లక్షలు మిగిలినట్లే అన్నారు. అద్సరే, చెయ్యవసరం లేని ఖర్చు ఎలా మిగులుతుందీ? ఇక నేను నీ ధోవతులుతుకుతూ, నా ఎకనమిక్సు ఎమ్మే పుస్తకాలు ఆరేసుకుంటూ..." విసురుగా లోపలికెళ్లాలని అడుగులు వేశాను.

పిలిచాడు.

అక్కడనుంచే ఓ చూపు చూశాను.

"అలాచూస్తున్నావు కాబట్టి, నాకో ఐడియా!" నవ్వుతూ దగ్గరికి పరుగెత్తాను.

దీర్ఘంగా ఆలోచించి, "ఆఁ, శ్రీకాముకునకు దుర్గయు ... అంటాడు పోతన. అంటే ఎవరికి ఏది కావలసివస్తే ఎవర్ని అడగాలో అద్వితీయమైన ద్వితీయస్కంధలో ఒక లిస్టు ఇచ్చాడులే - నువ్వా పని చెయ్! దుర్గాదేవిని ప్రార్థించి మొదలెట్టు. ఈ వ్యాసానికి కావల్సిన మాటలొస్తాయి. మాటలంటే మాటలా మాటలే సంపదలు!"

"ఎలా ప్రార్థించడం? టెన్షన్‌గా ఉంది. మరీ ఇది బంగారమై కూచుంది. ఇంకొకటింకొక్కటైతే అనుకోవచ్చు."

"ఏంలేదు, మా నాన్నగారే రాసిన ప్రార్థన పద్యం ఉంది కదా! అమ్మలగన్నయమ్మ ..." రాగం తీశాడు.

"ఆఁ, ఆఁ, అది సరిపోతుందా! దుర్గమాయమ్మ కృపాబ్ధి ఇచ్చుత మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్!' ఎంతో వినయంగా చదివాను.

"ఆఁ, ఆఁ, అదుగో అదే భక్తి. అదే మహత్యం! ఇక నీ పటుత్వం మొదల యినట్లే!"

"అలాగే. నన్ను డిస్టర్బ్ చేయనద్దు. నీ తమలపాకుల డబ్బా ఇక్కడే ఉంచాను. నే కాఫీ తాగినప్పుడల్లా నీకిస్తాను. ఇంకేవన్నా కావాలంటే చెప్పు!"

అడ్డంగా చేయి ఊపుతూ - "తన్నులో నమ్మిన వేల్పుటమ్మల మనంబుల నుండెడియమ్మ ...." అంటూ నడుం వాల్చాడు.

కాగితాలు ముందేసుకుని మాక్సీ సవరించుకుని మొదలెట్టాను.

"బంగారం చాలా గొప్పది."

చప్పగా ఉంది.


"బంగారాన్ని మించినది ప్రపంచంలో మరొకటి ..."

ఇది మరీ ఉప్పగా ఉంది.

బంగారం ... బంగారం ... బంగారం ఏవిఁటీ, ఏవీ ఐడియాలు రావేం?

తాతయ్య చెప్పింది నిజమే. బంగారం గురించి ఆలోచిస్తుంటే మాటలు కూడా రావడంలేదు.

బంగారంవద్దు. వ్యాసం. మంచివ్యాసం రాయాలి! రాయాలి!



### జామ్ ... జామ్

"కొత్త డి.సి.పి. ఎక్కణ్ణించి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చారు?" ట్రాఫిక్ పి.సి. తన కొలీగ్‌ని అడిగాడు.

"జామ్ నగర్ నుంచి."

**- ఎస్. హన్మంత్రావ్** (విశాఖపట్నం)

కలం కాగితాల మీద పడేసి అటూ ఇటూ పచార్లు చేశాను.

ఫరవాలేదు, రావచ్చు.

మరీ స్పీడుగా పచార్లు చేస్తూ మాక్సీ తట్టుకుని పడబోయాను.

ఐడియా!

పరుగెత్తిపోయి నా చిలక రంగు ట్రంకుపెట్టను పలకరిం చాను. కిర్రుమంటూ తెరుచు కుంది. మాక్సీ తీసేసి వోణీ పట్టుదే - పట్టుపరికిణీ వేసుకున్నాను. అద్దంలో ఓసారి చూసుకుంటూ మనోకాంతనీ, ముక్తికాంతనీ పలక రించాను. 'మీరైనా నాకీ సాయం చేయాల్రా' అంటూ కళ్లు గట్టిగా మూసుకున్నాను.

వాళ్లిద్దరూ కలిసిపోయి కనకదుర్గలా కనిపిం చారు. కలం తీసుకున్నాను. అంతే!

... ... ...

... ... ...

అమ్మయ్య! అయిపోయింది. ఒళ్లంతా చెమట తో తడిసిపోయింది. టైమెంతయిందో తెలీదు. ఫెయిర్‌కాపీ చెయ్యాలా, వద్దా?

తాతయ్యకు చూపించకూడదు. మళ్లీ సవరణ లంటూ రాగం తీస్తాడు.

ఇక ఫొటో. కలర్ అయితే బాగుంటుంది.

అవును, ఆ మధ్య మా సీనియర్ చెంచులక్ష్మిని పెళ్లికూతుర్ని చేసిన రోజు వాళ్లింట్లో బిందె నడుం మీద పెట్టుకుని సింగిల్‌గా దిగిన కలర్‌ఫొటో అయితే!

ఫొటోలున్న కవరు తెచ్చి చాపమీద కుమ్మరించి వెతికి చేతిలో పట్టుకున్నాను.

"వండర్‌ఫుల్‌గా ఉన్నావే లక్కిం!" వెరీగుడ్! ఇక ఇదే మూడ్‌లో ఫెయిర్‌కాపీ చెయ్యాలి.. ఆఁ, ఎందుకులెద్దూ, బాగానే ఉంది. మరోసారి చదివితే సరిపోలేదా!

ఇంతకీ టైటిల్ ఏం పెట్టాలి?

తట్టింది ....!

* * *

సర్వమంత్ర

"కొలుచువారల కెల్ల కొంగు బంగారమ్ము

పిలుచువారలకెల్ల ప్రియసఖుండు..." అంటూ అక్కాస్ అండ్ వద్నాస్ అర్ఘ్యపాత్రలతో ఆహ్వానించా రట వినాయకుడిని.

వెయిట్! వెయిట్! కొంగు బంగారం అంటే అర్థమేమిటి?

ఆడవారికి బంగారం జాడ కనవడకపోతే నాడి సరిగా ఉండదని చరకుడు చెప్పాడో లేదో కానీ, చరిత్రంతా మనల్నీ, బంగారాన్నీ బిందెల్లా లంకె వేసింది.

రాజులు, రాణులు ఒకపక్క బంగారంలో మునిగితేలుతుంటే, వాళ్ల పక్క న చేరిన కవులు సాహితీ చీమల్లా కృషిచేసి పుట్టలుపుట్టలుగా బంగారపు నాయికానాయకుల ప్రణయకథలను కట్టి పాపం, వాళ్ల గుట్టురట్టు చేశారు. ఇక రాజులు లొట్టలు వేసుకుంటూ వాళ్లకి బంగారుకంకణాలు తొడి గించారు.

మరీ థ్రిల్లింగ్ ఐడియాలు లేక శుష్కించిన ఓ కవీంద్రుడు తన శోషలో పద్యం పెట్టే గిన్నెను బం గారంగా భ్రమించి ఈ వీరక్విజ్ వేసి ఉంటాడు, చూడండి. బెత్తెడంత పుత్తడిగిన్నె నిండా తలగొట టనట్లు నువ్వులు నింపితే ఎలా ఉంటుందిట?".

నేనైతే ఠకీమని చెప్పేదాన్ని-"శ్రీశుకుడిని తలు చుకుని శీఘ్రంగా కళ్లు మూసుకో, నాయనా!" అని.

ఇలాంటి గీర కబుర్లు చెప్పమంటే చెప్తారు కానీ, జువెల్రీ షాపులో నిటారుగా నిలబడి బేరం చేసే మగాడేడీ? మీ ఎదురుగా ఉన్న కుర్రాడిని గ్రాము బంగారం ధర ఎంతో అడగండి! ఆలోచించి లెక్కకట్టి చెప్పవచ్చేమో! వెంటనే డబ్బిచ్చి ఓ కిలో బంగారం తెమ్మని పంపండి. ధైర్యంగా తేగలడా?

బంగారప్పొగుల్లేని రాజకీయాలు ఏవీ? గోల్డెన్ ఎరా, సువర్ణాక్షరాలతో రాసిన కీర్తికాంతీ ఇవన్నీ ఏమిటీ? బంగారంలేని దేశం లేదు. అది లేని సంస్కృతి ఏ దేశంలోనూ ఏ కాలంలోనూ లేదు. అప్పటి ఒలంపియా నుండి రేపు సిడ్నీ వరకు జరిగే ఆటల పోటీలక్కూడా గోల్డు సిల్వరే కీర్తిప్రతిష్ఠలు.

ఇక వేదాంతానికొద్దాం. కాంతా అండ్ కనకం ఆత్మజ్ఞానానికి స్పీడ్ బ్రేకర్లట! ఓకే! ఇక ఆత్మ అంటే ఏమిటి గురువుగారూ?

"సువర్ణం ఒక్కటే - ఆభరణాలు వేరు. ఆత్మ కూడా అంతే!" అంటూ బంగారం పోర్టికోలోనే ఆగింది. ఆత్మసంగతి నాకుతెలియదు. ఆభర ణాలు మాత్రం అదేపనిగా మారుస్తుంటే బంగారం తరుగుబోతుంది.

జనపదాల్లో ఉండే ముద్దుముచ్చట్లన్నీ కనక వర్షమే! నీ ఇల్లు బంగారం గానూ, బంగారంలాంటి పిల్ల, ఏంటయ్యా అలా చూస్తావూ - ఇదేవన్నా బంగారమా? ... ఇలా సందుదొరికినప్పుడల్లా సువర్ణ స్మరణే!

బంగారాన్ని, మట్టినీ సమంగా చూసేవాడు స్థితప్రజ్ఞుడని చెప్పాట్ట గీతాచార్యుడు. ఆఁ, అవున వును. అంత స్థితప్రజ్ఞుడు కాబట్టే అమ్మ యశోద అతన్ని మట్టి తింటుండగా పట్టుకుంది. మీరూ ఆ యశోదలాగా మట్టి తింటున్నాడనుకున్నారు. కాదు, మట్టినే బంగారమనుకుని తిని ఉంటాడు. లేకపోతే వాళ్లమ్మ నోరు తెరవమన్నప్పుడు ఒకటా, రెండా - అన్ని లోకాలెలా కనిపిస్తాయి? ఈ పిల్లాడిని పుటక లకు తండ్రి వసుదేవుడు కూడా ఆ ఆనందం పట టలేక ఆ జైల్లో వీలు కాక మనసులోనే సువర్ణదానాలు వగైరా చేశాట్ట! ఆ విధమైన ఉత్సాహంతో పెద్దయ్యాక రోజూ కిలోల కొద్దీ బంగారాన్నిచ్చే శ్యమంతకమణి ప్లస్ సత్యభామని పెళ్లి చేసుకున్నాడట. అసలీ త్రైలోక్య కుటుంబపోషణార్థమే విష్ణుమూర్తి లక్ష్మీ దేవిని పెళ్లాడాడు. ఆయన్ని ఈవిడే వరించిందని పుకార్లు లేకపోలేదు. ఉండవచ్చు. "నీకు బంగారం పిచ్చి! నువ్వు నాకొద్దు!" అని గుండెలమీద చేయి వేసి అతను లక్ష్మీదేవిని నెట్టవచ్చు. నో, అలా అన్లే దు! తన గుండెలమీద పెట్టుకున్నాట్ట.

సో,

కంబుకంఠి నీవు కలవాడు కలవాడు

లేనివాడు నీవు లేనివాడు - అనే సూత్రప్రకారం లక్ష్మీదేవి ఇంకా లేనివాడు, విష్ణుమూర్తి గారెవరు?

ఆరోగ్యం భాస్కరాధీనం అంటారు. ఆ సూర్యు ణ్ణి రోజూ కొక్కరకో అంటూ ఆహ్వానించే కాలజ్ఞాని పేరు కలిసి వచ్చేట్టుగా తన కొడుక్కి 'హనేమన్' అని పేరు పెట్టుకుందో జర్మను తల్లి. ఆత్మహత్యా భావాల్ని అరికట్టే మందుల్లో 'ఔరమ్ మెటాలికమ్' అంటాడు ఆ హోమియో పితామహుడు. అంటే అది గోల్డుమెటల్!

అంతెందుకు? సువర్ణంతో పుటంబెట్టిన శుద్ధమకరధ్వజం మీకు ఫ్రీగా వస్తే మీ ఆయన్ల చేత ఒక మండలమేమిటి - మండలాలుపాటు తినిపించుకోరా? శుద్ధ అంటే జ్ఞాపకం వచ్చింది. మీకు సంగీతం వస్తే వేంకటమఖి తెలిసే ఉండాలి. వారే కర్ణాటకమేళాల్ని కనిపెట్టింది. మొదటి రాగానికి 'కనకాంగీ' అంటూ బంగారంలో రాగం పలికాడు. రాగలక్షణాలు గమనించండి - షడ్జమం, శుద్ధ రిషభం, శుద్ధ గాంధారం, శుద్ధ మధ్యమం, పంచమం, శుద్ధ దైవతం, శుద్ధ నిషాదం, శుద్ధ - శుద్ధ - శుద్ధ ... అంటే ఇక కనకాంగికాక ఏమవుతుంది? బంగారా నికి మోహం వాచిపోయి వేంకటమఖి ఇలా చేశాడేమో ననుకున్నాను. సారీ, ఆరా తీస్తే రఘునాథ నాయకుడి మంత్రి. పైగా ఆయన కుమారుడైన విజయరాఘవుని రాజ్యాన్ని స్థాపించాడట కూడా. సరిపోలేదూ? బంగారం భగవంతుడో అలాంటిదేదో అయి ఉంటుందంటాడు మా తాతయ్య. మన ప్రార్థన కాదు. దాని దయ! అది వచ్చాక దానిపట్ల మనకి కృతజ్ఞత లేకపోయిందో, గోవిందా!

బంగారంమీద బంగారంలాంటి వ్యాసాలు పోగులు పోగులుగా ఎన్నో రాయొచ్చు. రిజర్వు బాంకు, వరల్డ్ బాంకు - ఇక అది ఏ బాంకయినా

స్టాండర్డు మాత్రం గోల్డే! మంత్రాలకు చింత కాయలు రాలవచ్చు, రాలకపోవచ్చు. చింతకాయల దగ్గర్నించీ మంత్రాలదాకా అన్నీ రాలగొట్టేది బంగారమే! సర్వమంత్ర!

సో, బీ ఫ్రాంక్. నంబర్‌వన్ - బంగారం గొప్పది కాదా, గొప్పదా? అవును అనేది సమాధానమయితే ఇక మరి ఆడవాళ్లకీ, బంగారానికీ ఉన్న అవినాభావ సంబంధం అడగొద్దు. దట్సాల్! గొప్ప వస్తువులు గొప్పవారివద్దే ఉంటాయి. నీదేం పోయింది పేద్ద!"

అమ్మయ్య!

చివర్న సంతకం పెట్టి, ఫొటో జతచేసి, అడ్రసు అందంగా రాసి కవర్లో పెట్టి ముద్దెట్టుకున్నాను.

అమ్మవారి పాదాలవద్ద పెట్టాను.

పోస్టు చేసేటప్పుడు బాక్సులు పెట్టిన చేతినుండి కవరు ఎంతకీ జారదు. చేయివదలదు. మళ్లీ ఓ సారి తృప్తిగా చూసుకచుని అటూ ఇటూ చూసి ఠకీమని వదిలేశాను. బాక్సు చెంపమీద ముద్దుగా చేత్తో తట్టాను.

* * *

హిందీ పాట పాడుకుంటూ వంట చేస్తున్నాను. "లోపలికి రండి!" అంటు న్నారు తాతగారు ఎవర్నో.

వంటింటి కిటికీలోంచి చూద్దును కదా, ఓ కారు, కార్లోంచి ఓ సీనియర్ సిటిజన్ దిగుతున్నాడు. ఖద్దరు లాల్చీ, ఉత్తరీయం. ఇతనికెందుకో గొలుసు?

ఓ పల్చటి గొలుసు మెడలో. నెరసిన అంచుల్తో నిగనిగలాడుతున్న బట్టతల. తెల్లరాళ్ల గుండీలతో లాల్చీ, మడతలువిడని పంచె, కారకంచెడని కిర్రుచెప్పులూ.

నేను వేగంగా అసలు పాలున్నాయో, లేదో చూసి వెంటనే డికాక్షనుకు నీళ్లువేసి, బిస్కెట్లు ఎక్కడ దాచానో వెతుకుతూ, 'అమ్మయ్య, దొరికాయి! ఇక కప్పులు రెడీచేయాలి!' అనుకుంటూండగా -

"ఓసారి బయటికి రామ్మా!" అంటూ తాతగారు పిలిచారు.

మంచినీళ్ల గ్లాసుల ట్రేతో వెళ్లాను.

వచ్చిన పెద్దమనిషి నన్ను ఆప్యాయంగా, లాలన గా చూశారు.

"నమస్కారం" అన్నాను వినయంగా.

"కాఫీలు పట్రామ్మా! చెప్పండి, కాశీపతిగారూ!' ' అంటూ అటు తిరిగారు తాతగారు.

చెమట లేకపోయినా పమిటతో ముఖం తుడుచుకుంటూ వెళ్లి కాఫీలు తెచ్చాను.

"నువ్వు కూడా తీసుకోమ్మా, కూర్చో!" అన్నారాయన.

"ఫరవాలేదు, ముందు మీరు బిస్కెట్లు తీసుకోండి!" అన్నాను మడతపడిన వెండిపట్టాని ఎప్పుడు వంగి సవరించుకుందామా అని ఆలోచిస్తూ.

"ఆ మధ్య మేము బాక్స్ నంబరుతో ఇచ్చిన ప్రకటనకి వ్యాసం రాశారు. మీరే కదా!"

నేను మౌనంగా తలూపాను. ఫొటో చూళ్లేదా అనుకుంటూ.

"సంతోషం! మీరు విజేతలని చెప్పడానికి వచ్చాను."

'వ్హాట్' అనబోయి, "ఇంకెవరెవరికి వచ్చాయండీ ప్రైజులు?" ఎంత ముందుకి వంగి ఎలా అన్నానో - మెడ పట్టేసినట్టయింది.

"వివరాలన్నీ మా ఇంట్లో చెపుతాం. మీరూ, మీ నాన్నగారూ, అమ్మగారూ - అన్నట్టు ... వారిక్కడ లేరట కదా! మీరూ, మీ తాతగారూ మా ఇంటికి రావాలి 24వ తేదీ సాయంత్రం ఏడు గంటలకి.' '

"అలాగే, తప్పక వస్తాం!" అన్నారు తాతగారు.

"ఆ రోజా ... నాకో ఎగ్జామ్ ఉందండీ ...!" అంటూ నసిగాను - ఏమిటో ఈ గొడవనుకుంటూ.

తాతగారు అందుకుని, "ఏం ఫరవాలేదమ్మా! పరీక్షయితే పస్తుంటామా ఏమిటి?"

కాశీపతిగారు బెదిరినట్టు చూసి, "అవునవును ... భోజనాలు కూడా!" అంటూ సర్దారు.

"మీ అడ్రసు ఇప్పించారు కాదు!" అన్నారు తాతగారు.

"అక్కర్లేదు, మా కారు పంపిస్తాము. వస్తానండీ, నమస్కారం! వెళ్లొస్తానమ్మా!" అంటూ వెళ్లబోతుంటే నేనుండబట్టలేక తడబడుతున్న అడుగులతో అనుసరిస్తూ, "ఇంతకీ ఏం ప్రైజండీ?" అని అడిగాను.

ఆయన పకపకా నవ్వి, "నిన్ను నిరుత్సాహపరచం లేవమ్మా! అందరిలో స్వయంగా తీసుకుందువుగాని!" అంటూ నడిచారు.

నేను కారు నంబరు వెతుకుంటే ప్రశంసగా నవ్వి, "ఇలా రండి! ఇతనే డ్రైవరు!" అంటూ చూపించాడు.

అంత పెద్దకారు నడపడం ఇంత చిన్న వయసులో ఎలా నేర్చుకున్నావ్ బుజ్జీ అందామనిపించేంత లేతబుగ్గలు.

నాకు తెలీకుండా అలా నేనెలా నవ్వానో?

అబ్బ! అంత సిగ్గుపడిపోయాడు కూడానూ.

* * *

ఎగ్జామ్ ఏం రాశానో. సాయంత్రం మనకి డిన్నరోచ్ అంటూ మా కాంతాస్‌కి చెప్పాను. మనో కాంత సరేసరి! ముక్తికాంత ముసి ముసిగా నవ్వుతూ, "సాయంత్రం భోజనాలని డిన్నరనరు, సప్ప రంటారు!" అంది సవరిస్తూ.

పట్టుచీరలో ఏ ఆడపిల్ల బావుండదూ?

'తాతయ్యా! నే బాగున్నానా?'అడిగాను భుజంమీద నుంచి పైట లాగుకుంటూ.

"మా నాయనమ్మలానే ఉ న్నావు. ఏదీ ఈ అపురూపంలో ఒక్క మంచిమాట చెప్పు!"

"ఏం మాట?"

"నా పేరు మంచి పేరు" విడివిడిగా పలికాడు.

నేను పగలబడి నవ్వుతూ, "నా పేరు తాతయ్యంత మంచి తీయటి ముద్దు పేరు!" నా చేతుల్తో తాతయ్య చెంపల్ని ముద్దుగా పట్టుకున్నాను.

తాతయ్య కళ్లు ఆనందంతో చెమ్మగిల్లాయి. రెండు చుక్కలు పమిటమీద రాలాయి.


"మీ నాయనమ్మ కాసులపేరు నీ మెళ్లో లేదు. కానీ నీ కంఠంలో ఎన్ని సౌజన్యాభరణాలు!' ' వంగి తాతయ్య పొట్టమీద తల ఆన్చి అలాగే చిన్న గా జారి పాదాలు తాకాను.

బయట కారు హారన్ వినిపించింది.

చిన్నగా లేచి, కళ్లు తుడుచుకుని వడివడిగా బయటికి రాబోయి పట్టుచీర కాబట్టి, ఎంతో నిదానంగా వచ్చాను.

అరె! ఆ బుగ్గల పిల్లాడే డ్రైవరు!

* * *



## దొందు దొందే

రైలు ప్రయాణీకుల మధ్య అనేక విషయాలమీద చర్చ సాగుతోంది. హఠాత్తుగా డాక్టర్లమీదకి మళ్లింది చర్చ.

"ఈ రోజుల్లో కుడి కంటికి జబ్బుంటే, ఎడమకంటికి ఆపరేషన్ చేసేస్తున్నారు డాక్టర్లు!" అంటూ ఎద్దేవా చేశాడు ఒకడు.

పక్కనే కూర్చుని వీళ్ల మాటలు వింటున్న కంటి డాక్టరైన మరో ప్రయాణీకుడు ఉండబట్టలేక - "ఈ రోజుల్లో పేషెంట్లూ అలాగే ఏడుస్తున్నారు. ఒకతను పంటి నొప్పితో కంటి డాక్టరైన నా దగ్గరికొచ్చా డీమధ్య!" కసిగా అన్నాడు.

- ఎస్. హన్మంత్రావ్ (విశాఖపట్నం)

కారు ఎటెటో పోతోంది. చిలకలగూడ నుండి టాంక్‌బండ్‌మీదుగా ... సరిగ్గా పోతన విగ్రహం దగ్గరకి వచ్చేటప్పటికి తాతయ్య కారు విండోలోంచి చేతులు బయట పెట్టి నమస్కారం చేసి, నాకు చూపించారు.

"తాతయ్యా! పోతన ఎందుకంత ఆనందంగా ఉన్నాడూ?"

"భాగవతం రాస్తున్నప్పుడు వాళ్లమ్మ పదే పదే జ్ఞాపకం వచ్చి!" అన్నాడు.

అలా తాతయ్య అక్కడున్న కవులనందరినీ చూపిస్తుంటే పట్టుచీర పవిత్రమైపోయింద నిపించింది.

* * *

జూబ్లీహిల్స్‌ట!

పెద్ద ఇంటిముందు కారు ఆగింది.

నాలాగా ఎవరైనా విజేతలున్నారేమో, అంతకు ముందే వచ్చారేమో అని చూశాను.

బయట ఎవరూ లేరు. లోపల భోజనాలు మొదలయ్యాయేమో!

ఊహుఁ.

డ్రాయింగ్‌రూము ఎంతపెద్దదో. నవలల్లో ఉంటాయి. సినిమాల్లో కూడా చూపిస్తారు.

కూర్చున్న సోఫా మెత్తగా ఉంది.

తాతగారి పక్కన ఒదిగి సర్దుకున్నాను.

అయిదుగురు ఆడవాళ్లు వచ్చారు. విజేతలేమో ననుకున్నాను. ప్లేట్లతో తినేవేమిటో తీసుకొచ్చి టీపాయ్‌మీద పెట్టారు.

పనిమనుషులయితే మరి పట్టుచీరల్లో ఎందుకున్నట్టు?

నేను నమస్కారం పెట్టాలా, వద్దా అనుకుంటూ ఎందుకైనా మంచిదని పెట్టేశాను.

వెళ్లబోతున్నవాళ్లు తిరిగి చిరునవ్వుతో పలకరించి, "ఇప్పుడే వస్తాం, కూర్చో అమ్మా!" అన్నారు.

నేనెప్పుడు లేచానో! కూర్చున్నాను.

ఈ బంగారం బాపతు వ్యాసం ఏ దేవతకైనా మొక్కు కాదు కదా! నేనిలా దొరికిపోయాను.

కాశీపతిగారొచ్చారు. ఆయనతో ఆ డ్రైవరు పిల్లాడు - ఆ వెంట మరో ఎత్తుగా ఉన్న కుర్రాడు. అందరూ తెల్లటి యూనిఫాం లాంటి దుస్తులు.

తాతయ్యకు వారు నమస్కారం చేశారు. నేనూ లేచి చేతులు జోడించాను.

కాశీపతిగారు పరిచయం చేశారు - "వీడు మా చిన్నబ్బాయి సుమంత్!"

"డ్రైవరు! వాళ్లబ్బాయి!" నేన్నాలిక్కరుచుకున్నాను.

ఇంకా నయం తెగలేదు.

"పెద్దబ్బాయి - సామంత్!"

గుటకవేస్తున్నప్పుడు నాలికఅంగిటికి అతుక్కుపోయింది. ముక్తికాంత, మనోకాంత అతన్ని పోటీ పడి చూస్తున్నట్టు చక్కగా తెలుస్తోంది.

మళ్లీ ఆడవాళ్లొచ్చారు. అందరూ సోఫాలనిండా కూర్చున్నారు. కాశీపతి భార్యగారని పోల్చుకున్నాను. నా పక్కన వచ్చి కూర్చుంది.

"చూడమ్మా! మాకు ఇక్కడొకటీ, దుబాయ్‌లో మరొకటీ బంగారపు కొట్లున్నాయి. మా పెద్దబ్బాయి .... చార్టెర్డ్ వాల్యూయర్. ఇంటర్నేషనల్ మార్కెట్లో జూవెలరీ వాల్యూ చేస్తాడు. వాడి ముచ్చటతో, పట్టుదలలో ఈ పోటీ ఏర్పాటు చేశాం. నీ వ్యాసం వాడికి నచ్చింది. నీకే పారితోషికం!"

"ఇంకెవరూ లేరా?"

ఆడవాళ్లందరూ నవ్వారు.

"వీళ్ల నా చెల్లెళ్లు - రత్నగౌరి, వకుళ, సూర్యకాంత!" నన్నెత్తుకుని చంకలో వేసుకుంటున్నంత ముచ్చటపడుతున్నారు.

"పారితోషికం ఇప్పించండి, నేవెళ్తాను!" అన్నాను తడి ఆరిన గొంతుతో.

"మా సామంత్ - సామంతే నీ పారితోషికం!' ' స్వయంగా వాళ్లమ్మ అంటున్న మాటలు.

నేను కళ్లు మూసుకున్నాను.

ముక్తికాంత, మనోకాంత లిద్దరూ మొదటి సారిగా ముద్దెట్టుకున్నట్టుంటే ముఖం చేతుల్లో దాచుకున్నాను.

వాళ్లమ్మ అతన్ని పిలిచి, నా చేతులు ముఖం నుంచి తొలగించి, అతనిచేతిని నా చేతిలో ఉంచింది.

నా చేతులు వణుకుతుంటే తాతయ్య వైపు బేలగా చూశాను.

తాతయ్య చిరునవ్వుని చూశాను.

ఆ తర్వాత దండలిచ్చారు.

"ఎవరు ముందు వేయాలండీ?" అడిగారు కాశీపతిగారు తాతయ్యని.

"మా అమ్మాయే!"

నేను పూలమాల వేస్తుంటే - సప్తాహం తర్వాత భాగవతం మీద పూలు చల్లినట్లు, అక్కడ భాగవతం రాసుకుంటున్న పోతనకి వేయడం కోసం తాతయ్యకి అందిస్తున్నట్టూ అనిపించింది.

ఇది కలా, నిజమా అనిపించింది.

నా కాంతలిద్దరూ నిజమని చెప్తుంటే, "ఇక భోజనానికి లేద్దామా?" అన్నారు కాశీపతిగారు.

నన్నూ, వారినీ ముందు నడిపిస్తున్నారు.

నన్ను పట్టుకుని నడిపిస్తున్నది గౌరీ మనోహరో, సూర్యకాంతమో!

"మీ పేరేమిటి అత్తయ్యగారూ!" అన్నాను చిన్నగా.

"వకుళాభరణం - నీ అంత మంచి పేరు కాదులే!" అంటూ నవ్వి, చెయ్యి గట్టిగా నొక్కింది.

అంతే!

నా భయం, బెరుకు పోయాయి.

డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చోబోయేముందు వారివేపొకసారి చూసి సుమంత్ వేపు చూపించాను.

"సుమంత్!" అంటూ పిలిచారు. ఎంత తియ్యటి కంఠమో!

సుమంత్ వస్తూ మా ముందు చిరునవ్వుతో నిలబడ్డాడు.

"నువ్వు ఆ రోజు మా ఇంటికి నాన్నగారితో వచ్చినప్పుడు లోపలికి రాలేదేం?"

సుమంత్ నీళ్లు నములుతూ అన్నాడు - "మిమ్మల్ని అన్నయ్యతోనే చూడాలని."

ఒళ్లు జివ్వుమంది.

ఇంతలో తాతయ్య వచ్చి, నా చెవిలో రహస్యంగా " నాయనా! ఈ మంచి సమయంలో నిన్నెలా ఆశీర్వదించనూ? చెప్పు!" అన్నారు.

నేను తల పైకెత్తి అందరితో పెద్దగా చెప్పాను - "మా తాతయ్యగారు ఇప్పుడు మనందరినీ ఆశీర్వదిస్తారు!"

అందరూ తాతయ్యవైపు చూశారు.

తాతయ్య నా తలమీద కుడిచేతిని ఉంచి, అదే చేత్తో కంఠం సవరించుకుని, రాగయుక్తంగా-

"ఎయ్యది కర్మబంధముల నెల్ల హరించు
విభూతి కారణం బెయ్యది
సమ్మునీంద్రులకు నెల్ల కవిత్వ
సమాశ్రయంబు మున్నెయ్యది
సర్వమంత్రముల నేలిన దెయ్యది
మోక్షలక్ష్మి రూపెయ్యది
దాని నుతింతు సుహృద్యము
భాగవతాఖ్య మంత్రమున్!